తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం - 06 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 338 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## పంట కొనుగోళ్ల ఆలస్యం

2లో

రైతుల ఆవేదనపై కేటీఆర్ ఆగ్రహం

యశ్వంతపూర్ ఐకేపీ కేంద్రం పరిశీలన

15 రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయినట్టు రైతుల వాపో

మార్క్‌ఫెడ్ అధికారుల వైఖరిపై నిలదీత




# స్టేషన్ ఘనపూర్ బిఆర్ఎస్ పార్టీలో వర్గపోరు!

### రాజయ్యను తప్పించి అరూరిని రప్పించే ప్రయత్నాలు

**అరూరిని రప్పించేందుకు ధర్మసాగర్ మండలానికి చెందిన ఓ బడా నేత తీవ్ర ప్రయత్నాలు**

**ధర్మసాగర్,వేలేరు,చిల్పూర్ మండలాల్లో వర్గాలుగా ఏర్పడుతున్న బిఆర్ఎస్**

**బిఆర్ఎస్ ఫ్లెక్సీల్లో రాజయ్య అవుట్ ఆరూరి ఇన్**

**స్టేషన్ ఘనపూర్,మే5(తెలంగాణ ముచ్చట్లు):**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ అంతర్గత రాజకీయాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను లక్ష్యంగా చేసుకుని పద్ధతిగా జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు బహిరంగంగా కనిపిస్తున్నాయి. పార్టీకి సంవత్సరాలుగా పనిచేసిన నాయకుడిని ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అభిప్రాయం బలపడుతోంది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తిరిగి పార్టీలో చేరిన నాటి నుంచి ఈ పరిణామాలు వేగం పుంజుకున్నాయి. ఆయనను స్టేషన్ ఘనపూర్‌కు తీసుకురావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం మధ్య, ఆయన తరచూ నియోజకవర్గంలో పర్యటించడం రాజకీయంగా అనేక సందేహాలకు దారితీస్తోంది. ఇటీవల వేలేరు మండలంలో జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో రాజయ్య ఫోటో లేకపోవడం యాదృచ్ఛికం కాదనే అభిప్రాయం స్పష్టంగా వినిపిస్తోంది.

ఇదే తరహాలో, వరంగల్‌లో జరగనున్న రైతు సంగ్రామ సదస్సు కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కూడా రాజయ్య చిత్రాన్ని పూర్తిగా తొలగించడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. ఇది కేవలం నిర్లక్ష్యం కాదని, పక్కా ప్రణాళికతో అమలు చేస్తున్న రాజకీయ వ్యూహమనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ధర్మసాగర్, వేలేరు, చిల్పూర్ మండలాలకు చెందిన కొందరు నాయకులు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ముఖ్యంగా ధర్మసాగర్ మండలానికి చెందిన ఓ బడా నేత వెనుక నుంచి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నాడనే గుసగుసలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. పార్టీ క్రమశిక్షణను పక్కన పెట్టి వర్గ రాజకీయాలను రెచ్చగొడుతున్న చర్యలు ఇప్పుడు కార్యకర్తల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి.

ఈ పరిణామాలన్నింటిని పరిశీలిస్తే, రాజయ్యపై రాజకీయంగా ఒత్తిడి పెంచి ఆయన ప్రభావాన్ని తగ్గించాలనే కుట్ర జరుగుతున్నదన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. దళిత నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ చర్యలు పార్టీకి తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

పార్టీని బలహీనపరచే ఈ తరహా అంతర్గత రాజకీయాలకు తక్షణం చెక్ పెట్టాలని కార్యకర్తలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. విభేదాలను రెచ్చగొడుతూ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న నాయకులను కట్టడి చేయకపోతే, స్టేషన్ ఘనపూర్‌లో బిఆర్ఎస్ పార్టీకి తీవ్రమైన దెబ్బ తగిలే పరిస్థితి తలెత్తే అవకాశముందని స్పష్టమవుతోంది.

### రాజయ్య దగ్గర పదవులు పొందిన వారే నేడు విమర్శకులు

**ఇదిలా ఉండగా, రాజయ్య వద్ద నుంచే పదవులు, రాజకీయ అవకాశాలు పొందిన కొంతమంది నాయకులే ఇప్పుడు ఆయనను లక్ష్యంగా చేసుకోవడం గమనార్హంగా మారింది. ఒకప్పుడు ఆయన నాయకత్వంలో ఎదిగినవారే ఇప్పుడు వ్యతిరేక ధోరణితో వ్యవహరిస్తుండటం పార్టీ అంతర్గత విభేదాల తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది.**

### అధిష్టానం పట్టించుకోకపోతే...!



అధిష్టానం ఈ పరిణామాలను నిర్లక్ష్యం చేస్తూ చూస్తూ ఉంటే, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో పరిస్థితులు మరింత విషమించే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే వర్గపోరు బహిరంగ స్థాయికి చేరుకున్న వేళ, దీనిని అదుపులో పెట్టకపోతే పార్టీ బలం దెబ్బతినడం అనివార్యమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభావం ఉన్నప్పటికీ, స్టేషన్ ఘనపూర్‌లో మాత్రం బిఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి విజయం సాధించడం ప్రత్యేకంగా నిలిచింది. అలాంటి బలమైన స్థావరంలో ఇప్పుడు అంతర్గత విభేదాలు తీవ్రరూపం దాల్చడం పార్టీకి హెచ్చరికగా మారింది. ఇప్పటికైనా అధిష్టానం జోక్యం చేసుకుని వర్గ రాజకీయాలకు చెక్ పెట్టకపోతే, స్థానిక స్థాయిలో ఏర్పడుతున్న అసంతృప్తి మరింత పెరిగి, రాబోయే ఎన్నికల్లో ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలు కొనసాగితే, స్టేషన్ ఘనపూర్ బిఆర్ఎస్‌కు గడ్డు కాలం దూరంలో లేదనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.




తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పంట కొనుగోళ్ల ఆలస్యం

**జనగామ, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ నియోజకవర్గంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఉన్న ఐకేపీ పంట కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించారు. పంట కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యంపై రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు 15 రోజులుగా పంట కొనుగోళ్లు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎన్నిసార్లు మార్క్‌ఫెడ్ అధికారులను, కలెక్టర్‌ను సంప్రదించినా స్పందన లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను విన్న కేటీఆర్ వెంటనే మార్క్‌ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. పంట కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ప్రశ్నిస్తూ, మార్క్‌ఫెడ్ వైఫల్యాన్ని తీవ్రంగా విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలనీ, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాలని కోరారు. పంటను అమ్మలేక



రైతులు నష్టపోతున్న పరిస్థితిని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ స్పందన చూపాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. వ్యవసాయ రంగం పట్ల నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఈ పరిశీలనతో రైతుల్లో కొంత ఊరటనిచ్చినట్లు స్థానికులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏరోస్పేస్ తయారీ యూనిట్‌కు శంకుస్థాపన

- రూ.453 కోట్ల పెట్టుబడితో ఐటీపీ ఏరో ఇండియా ప్రాజెక్ట్
- 2027 నాటికి పూర్తి స్థాయి కార్యకలాపాలు
- వందలాది నైపుణ్య ఉద్యోగాలకు అవకాశం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**హైదరాబాద్, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. షంషాబాద్‌లోని హార్డ్‌వేర్ పార్క్ మూడో దశలో ఐటీపీ ఏరో ఇండియా తయారీ కేంద్రానికి శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై పనులను ప్రారంభించారు. సుమారు రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల్లో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతున్నారు. తెలంగాణను ఏరోస్పేస్, ఆధునిక తయారీ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగుగా అధికారులు పేర్కొన్నారు. ఈ తయారీ కేంద్రం 2027 నాటికి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుంది. ప్రారంభ దశలోనే సుమారు 350 మంది నైపుణ్య ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించనుంది. తరువాతి దశల్లో ఈ సంఖ్య దాదాపు 600కు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఆధునిక తయారీ, నాణ్యత నియంత్రణ వంటి విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్ర యువతకు ఉన్నత స్థాయి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షిస్తూ, సాంకేతికతను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి తోడ్పడతాయని అన్నారు. పారిశ్రామికాభివృద్ధి, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్రంలో ఉన్నత విలువైన ఉపాధి అవకాశాలను పెంచే దిశగా కీలకంగా మారనుంది.

# జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి శ్రీకారం

- రూ.2360 కోట్లతో మెగా పారిశ్రామిక ప్రాజెక్ట్
- ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన
- లక్షలాది ఉద్యోగాలకు దారి చూపనున్న సిటీ



**హైదరాబాద్, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో పారిశ్రామిక రంగానికి భారీ ఊతం ఇవ్వనున్న జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు మే 10న ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి ఈ వివరాలను వెల్లడించారు.

హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ మొత్తం రూ.2360.54 కోట్ల వ్యయంతో అమలు కానుంది. సుమారు 3,245 ఎకరాల్లో విస్తరించనున్న ఈ స్మార్ట్ సిటీ ఆధునిక మౌలిక వసతులతో కూడిన సమగ్ర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.10,000 కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. 2029 నాటికి దాదాపు 1.74 లక్షల ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. లాజిస్టిక్స్, ఆటో భాగాలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, లోహాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

స్మార్ట్ టెక్నాలజీతో కూడిన మౌలిక వసతులు, పర్యావరణ హిత అభివృద్ధి విధానాలు ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతగా నిలవనున్నాయి. ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక సదుపాయాలతో పాటు నివాస, వాణిజ్య ప్రాంతాలు, పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు వంటి సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. వ్యూహాత్మకంగా హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్‌లో ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రధాన తయారీ, లాజిస్టిక్స్ హబ్‌గా మారనుందని నిపుణులు భావిస్తున్నారు. ఇది తెలంగాణ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనుంది. పారిశ్రామిక కారిడార్ అభివృద్ధిని వేగవంతం చేస్తూ భారత్‌ను గ్లోబల్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు నాంది పలకనుంది.

# ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక సమీక్ష

- గంభీరావుపేటలో ప్రభుత్వ యంత్రాంగానికి కీలక దిశానిర్దేశం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన విస్తృత సమీక్ష
- మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో అభివృద్ధి పనుల పురోగతి విశ్లేషణ
- 99 రోజుల కార్యాచరణలో వేగం పెంచాలని స్పష్టమైన ఆదేశాలు

**రాజన్న సిరిసిల్ల, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక "99 రోజుల" కార్యాచరణలో భాగంగా జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై గంభీరావుపేట మండల కేంద్రంలో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షత వహించగా, ప్రభుత్వ యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, డా. కవ్వంపల్లి సత్యనారాయణ కూడా హాజరై జిల్లా అభివృద్ధి అంశాలపై సమగ్రంగా చర్చించారు.

సమావేశంలో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు. ముఖ్యంగా మౌలిక వసతులు, తాగునీటి సరఫరా, వ్యవసాయ రంగం, విద్య, ఆరోగ్య రంగాల్లో చేపడుతున్న పనులపై వివరాలు తెలుసుకున్నారు. పనులు ఎక్కడ ఆలస్యమవుతున్నాయో గుర్తించి వెంటనే వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు సమయానికి చేరేలా అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తేనే లక్ష్యాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపడుతున్న ప్రతి పనికి నిర్దిష్ట గడువు ఉండాలని, ఆ గడువులోపే పూర్తి చేయాలని నేతలు అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత ఉండాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామీణ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రతి మండలం, గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించేలా ఉండాలని తెలిపారు. మొత్తంగా ఈ సమీక్ష సమావేశం ద్వారా జిల్లా అభివృద్ధి పనులకు కొత్త ఉత్సాహం లభించగా, అధికారులు వేగవంతమైన అమలు దిశగా ముందుకు సాగాలని స్పష్టమైన సందేశం అందింది.

# సాహసానికి నిలువెత్తు ఉదాహరణ



- ఆటో డ్రైవర్ జాహెర్‌కు సీపీ సజ్జనార్ ప్రశంస
- గొలుసు దొంగను అడ్డుకున్న ధైర్యం
- ప్రాణాలకు తెగించి నిందితుడిని పట్టుకున్న ఆటో డ్రైవర్
- ప్రశంసాపత్రం, నగదు బహుమతి ప్రదానం

**హైదరాబాద్, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలో జరిగిన గొలుసు దొంగతనం యత్నాన్ని అడ్డుకుని సాహసం ప్రదర్శించిన ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్‌ను సీపీ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. బేగంబజార్ జిన్సీ చౌరహా ప్రాంతంలో జరిగిన ఈ ఘటన నగరవాసుల్లో చర్చనీయాంశంగా మారింది.

మహిళ ఒకరు తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్ చేస్తుండగా రౌడీషీటర్ మహమ్మద్ సోహెల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో స్కూటీ అదుపుతప్పి నిందితుడు కిందపడిపోయాడు. బాధితురాలు కేకలు వేయడంతో అక్కడి నుంచి వెళ్తున్న ఆటో డ్రైవర్ జాహెర్ అప్రమత్తమయ్యాడు. తక్షణమే తన ఆటోను వెనక్కి తిప్పి నిందితుడిని ఢీకొట్టాడు. దాంతో కోపంతో నిందితుడు కర్రతో జాహెర్‌పై దాడికి ప్రయత్నించినా, అతను వెనకడుగు వేయకుండా ధైర్యంగా ఎదుర్కొని నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించాడు. ఈ మొత్తం ఘటన సీసీ కెమెరాల్లో నమోదైంది.

గోషామహల్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడిపై ఇప్పటికే పలు పోలీస్ స్టేషన్లలో 16 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సాహసాన్ని గుర్తించిన సీపీ సజ్జనార్ జాహెర్‌ను సత్కరించి ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేశారు. "నేరం జరుగుతుంటే చూస్తూ ఉండకుండా అడ్డుకోవడం నిజమైన పౌర ధర్మం" అని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో నేరాలను నిర్లక్ష్యం చేసే పరిస్థితుల్లో, జాహెర్ చూపిన ధైర్యం సమాజానికి ఆదర్శమని సీపీ అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో భయపడకుండా వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

# ఢిల్లీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి... మెట్రో ఫేజ్-2పై దృష్టి

- కేంద్ర అనుమతుల కోసం కీలక భేటీలు
- పెండింగ్ ప్రాజెక్టులు, నిధులపై విజ్ఞప్తి
- జాతీయ రాజకీయాలపై కూడా చర్చల సూచనలు



**హైదరాబాద్, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై ముఖ్యమంత్రి విజ్ఞప్తులు చేయనున్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలనే అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. పాలనాపరమైన అంశాలతో పాటు జాతీయ రాజకీయాలపైనా ఈ పర్యటనలో చర్చలు జరిగే అవకాశం ఉంది. ఏఐసీసీ అగ్రనేతలతో సీఎం సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులపై అభిప్రాయాలు పంచుకోనున్నారు.

ఇటీవల కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన విజయంతో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతుండగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో కేరళ రాజకీయ పరిణామాలపై కూడా చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటన రాష్ట్రానికి అవసరమైన అనుమతులు, నిధుల సాధనలో కీలకంగా మారుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

## హైకోర్టు ఆదేశాలతో పాత బోర్డు పునరాగమనం – సింగిల్ విండో చైర్మన్‌గా కుండాల్ రెడ్డి బాధ్యతలు స్వీకారం

**హుజురాబాద్ మే 5(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్‌లో సింగిల్ విండో చైర్మన్‌గా కుండాల్ రెడ్డి మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. పాత పాలకవర్గానికి తిరిగి అధికార బాధ్యతలు అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో పాత పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో సింగిల్ విండో సీఈవో గోస్కుల వివేకానంద ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం జరిగింది. సిబ్బంది మహేందర్ రెడ్డి, విజయ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

హైకోర్టు నిర్ణయంతో పాత పాలకవర్గం తిరిగి బాధ్యతలు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






## మహిళలకు స్వయం ఉపాధి దిశగా మినీ డైరీ యూనిట్లు

ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్

**ఎల్కతుర్తి, మే 5 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే ఉద్దేశంతో బీసీ మరియు ఎస్సీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మినీ డైరీ యూనిట్ల ఏర్పాటు కోసం అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎల్కతుర్తి మండల ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్ తెలిపారు. ఈ పథకం కింద రెండు బర్రెలతో మినీ డైరీ యూనిట్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించబడుతుందని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ పరిధిలో యూనిట్ ఏర్పాటు చేసుకోవాలనుకునే అభ్యర్థులు మే 10, 2026లోపు తమ దరఖాస్తులను సంబంధిత గ్రామ పంచాయతీలలో ఆఫ్‌లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు. యూనిట్ మొత్తం ఖర్చు రూ.2 లక్షలు కాగా, అందులో 70 శాతం సబ్సిడీగా, మిగతా 30 శాతం బ్యాంకు రుణంగా అందించబడుతుందని వివరించారు.

ఇదే విధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా మినీ డైరీ యూనిట్లకు దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని తెలిపారు.

ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 0.10 ఎకరాల స్వంత వ్యవసాయ భూమి కలిగి ఉండాలని, వయస్సు 21 నుండి 60 సంవత్సరాల మధ్య ఉండాలని, వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు ఉండాలని, పాడి పరిశ్రమలో అనుభవం ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన ఆదాయ ధృవీకరణ పత్రం జత చేయాలని సూచించారు.

అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని ఎంపీడీవో కోరారు.



## జమ్మికుంటలో శానిటేషన్ పనులపై చైర్మన్ క్షేత్ర స్థాయి పరిశీలన

**జమ్మికుంట టౌన్ మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ పరిధిలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పలు వార్డులను సందర్శించి శానిటేషన్ పనులను పరిశీలించారు. పట్టణంలోని 30 వార్డులకు సంబంధించిన శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందిలో మార్పులు చేపడుతూ, అన్ని వార్డులకు సమానంగా సేవలు అందేలా జవాన్లను పునర్వ్యవస్థీకరించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా 5, 8, 23 వార్డులను పరిశీలించిన చైర్మన్, టీమ్ వర్క్ ద్వారా శానిటేషన్ పనులు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు అన్ని విధాలుగా మున్సిపల్ పాలకవర్గం అందుబాటులో ఉంటుందని, శుభ్రత పరిరక్షణలో ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు యట్ల సునీత అశోక్, కోలుగురి సురేష్, చింతల శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ కార్యకర్తల నిరసన

**హుజురాబాద్ మే 5(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్చి ) ముందు ఆశ కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమకు రావాల్సిన మార్చి, ఏప్రిల్ నెలల పెండింగ్ పారితోషికాలను వెంటనే విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో తాము కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, సరైన వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమయానికి పారితోషికాలు రాకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆశ కార్యకర్తలకు నెలకు కనీసం రూ.18,000 ఫిక్స్ వేతనం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు ఆశ కార్యకర్తలు పాల్గొని తమ ఐక్యతను చాటారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. నిరసన అనంతరం ఆశ కార్యకర్తలు తిరిగి తమ విధుల్లో చేరి సేవలను కొనసాగించారు.

## సేంద్రియ సాగుతో భూమికి శక్తి

# రైతుల భవిష్యత్తుకు భరోసా

గ్రామ సర్పంచ్ గొలిపెల్లి సంపత్

**ఎల్కతుర్తి, మే 5( తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన ప్రగతిప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా దండేపల్లి గ్రామంలో నిర్వహించిన "రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం రైతుల్లో కొత్త ఆశలను నింపింది. గ్రామ సర్పంచ్ గొలిపెల్లి సంపత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు.



వ్యవసాయ శాస్త్రవేత్తలు యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా భూమి సారం పెరుగుతుందని, దీర్ఘకాలంలో రైతులకు లాభదాయకమని చెప్పారు. భూసార పరీక్షల ద్వారా భూమి నాణ్యతను తెలుసుకుని, తగిన పద్ధతులు పాటిస్తే దిగుబడులు మెరుగవుతాయని సూచించారు.

సర్పంచ్ గొలిపెల్లి సంపత్ మాట్లాడుతూ "వ్యవసాయం బలపడితేనే గ్రామం అభివృద్ధి చెందుతుంది. రైతులు సహజ పద్ధతులు, పంటల మార్పిడి, నీటి సంరక్షణ వంటి విధానాలను పాటిస్తే ఖర్చులు తగ్గి, ఆదాయం పెరుగుతుంది" అని తెలిపారు. గ్రామంలో రైతులకు నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సేంద్రియ సాగును ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు శాస్త్రవేత్తలు సూచించిన మార్గాలను అనుసరిస్తామని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మంచి దిగుబడులు సాధిస్తామని తెలిపారు.

## ఆయిల్ ఫామ్ వైపు రైతుల మలుపు...

## హుజురాబాద్‌లో అవగాహన సదస్సు ఘనం

**హుజురాబాద్ మే 5(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుజురాబాద్‌లో ఉద్యాన,పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం రైతుల్లో మంచి స్పందనను రేకెత్తించింది.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ, సంప్రదాయ పంటలతో పాటు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆయిల్ ఫామ్ వంటి పంటలు తక్కువ ఖర్చుతో అధిక లాభాలను అందిస్తాయని వివరించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి, తమ ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా అధికారులు ఆయిల్ ఫామ్ సాగు విధానం, సంరక్షణ పద్ధతులు, మార్కెట్ అవకాశాలు వంటి అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీల గురించి కూడా వివరించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతుల అభివృద్ధి దిశగా ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## బక్రీద్ పండుగను మత సామరస్యంతో, పరస్పర గౌరవంతో జరుపుకోవాలి

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, మే 5(తెలంగాణ ముచ్చట్లు ):** బక్రీద్ పండుగను మత సామరస్యంతో, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.



బక్రీద్ (ఈద్‌ఉల్‌అధా) పండుగను పురస్కరించుకొని శాంతియుతంగా జరుపుకునేందుకు ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు,ఖురేసి ప్రతినిధులతో పోలీస్ యంత్రాంగం సమన్వయ సమావేశం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... గోవధ చేయవద్దని, కేవలం అనుమతించబడిన జంతువులను మాత్రమే, నిబంధనలకు లోబడి బలి ఇవ్వాలని సూచించారు.

అక్రమ పశువుల రవాణాను అరికట్టడానికి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిఘా ఏర్పాటు చేశామని అన్నారు. పశువులను తరలించేటప్పుడు సరైన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండటం తప్పనిసరి అని అన్నారు. ప్రార్థనా స్థలాలు, మసీదుల వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు, నిరంతర నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వార్తలు, వదంతులు ప్రజలు నమ్మవద్దని, అలాంటి సమాచారాన్ని వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బలి ఇచ్చిన తర్వాత జంతు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, మున్సిపల్ అధికారుల సహకారంతో తొలగించే చర్యలు తీసుకోవాలని మత పెద్దలను కోరారు. ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే సంబంధిత పోలీసులకు, కమాండ్ కంట్రోల్ సెల్ నెంబర్ 8712659111 కు సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారులు దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఏసీపీ రమణమూర్తి, మహేష్, సిఐ కరుణాకర్, మోహన్ బాబు, బాలకృష్ణ, ఎస్సై మౌలానా పాల్గొన్నారు.

## వేసవి కాలంలో త్రాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు...

–జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం బ్యూరో , మే-05(తెలంగాణ ముచ్చట్లు ):** వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.



డ్రింకింగ్ వాటర్, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ త్రాగునీటి సరఫరాపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమన్వయం ఉండాలని, ఫీల్డ్ స్థాయిలో అవసరమైన సమన్వయం చేసి సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పీక్ సమ్మర్ సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా ఫీల్డ్‌లోనే ఉండి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలని, ఎంపీడీఓలు, ఎంపీఓలు క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్లు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజాసేవలో స్పందన అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.

త్రాగునీటి సమస్యలు కేవలం ఆర్డబ్ల్యూఎస్ శాఖకు మాత్రమే సంబంధించినవి కావని, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు కూడా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో మే నెలలో త్రాగునీటి సమస్యలు తలెత్తే అవకాశముండటంతో ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

పైప్‌లైన్ లీకేజీలు, నష్టాలను వెంటనే పరిష్కరించాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే తెలియజేయాలని సూచించారు. రోడ్డు పనుల సమయంలో పైప్‌లైన్ దెబ్బతిన్నట్లయితే సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా ఖర్చు భరింపజేయాలని తెలిపారు.

మండలాల వారీగా త్రాగునీటి పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, మొదట మిషన్ భగీరథ నీరు ప్రజలకు చేరేలా చూడాలని, తదుపరి స్థానిక వనరులను వినియోగించాలని, అవసరమైతే బోర్వెల్ ఏర్పాటు చేయాలని, చివరిగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని దశలవారీ చర్యలు సూచించారు. ఎత్తైన గ్రామాలకు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటినీ సరఫరా చేయాలని, సమస్య తలెత్తిన వెంటనే స్పందించాలని తెలిపారు. త్రాగునీటి సమస్యలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన త్రాగునీటి నిధులను జెడ్పీ సీఈఓ సమన్వయంతో అవసరమైన చోట వినియోగించాలని సూచించారు. సరఫరా లేని ఇళ్లను గుర్తించి క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

వేసవి కాలంలో వీధి జంతువులు, చిన్న పక్షులు కూడా నీటి కొరతను ఎదుర్కొంటాయని, గ్రామాలు, మున్సిపాలిటీలలో స్థానిక సంస్థలు చిన్న, చిన్న నీటి గుంతలు (వాటర్ పిట్స్) ఏర్పాటు చేసి వాటికి తగినంత నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

హీట్ వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఒఆర్ఎస్ ప్యాకెట్లను పోలీస్ ఎస్‌హెచ్‌ఓలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. సన్‌స్ట్రోక్ బాధితుల వివరాలను సేకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, తగిన ఓఆర్ఎస్ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

లేబర్ శాఖతో సమన్వయం చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కోచింగ్ సెంటర్లు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు బయట నిద్రించకుండా అవగాహన కల్పించాలని, మార్కెట్లు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రజా ప్రదేశాల్లో త్రాగునీరు, ఒఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, డిపిఓ రాంబాబు, సిపిఓ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, మిషన్ భగీరథ ఎస్ఈ, ఈఈ, ఎస్ఈ పి.హెచ్., గ్రౌండ్ వాటర్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఏపిడిలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## గీత కార్మికుల చేత శీలం అనిల్ కుమార్ దంపతులకు ఘన సన్మానం

**ఎల్కతుర్తి, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ రేణుక ఎల్లమ్మ ఎల్కతుర్తి తిరుగు వారం మహోత్సవం లో భాగంగా ఎల్లమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో గీత కార్మికులు హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది.

ఈ సందర్భంగా శీలం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎల్లమ్మ పండుగను గీత కార్మికులు, గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారని తెలిపారు. పండుగ నిర్వహణలో అందరి పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. హిందూ దేవాలయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, సంప్రదాయాలు మరియు ఆచారాలను కాపాడుకోవడం ద్వారా మన సంస్కృతి నిలబెడతామని అన్నారు.

గ్రామంలో గీత కార్మికుల కష్టాలు, వారి జీవన విధానం గురించి కూడా ఆయన ప్రస్తావిస్తూ, వారికి మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. గీత కార్మికులు గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు.

ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గొడిశాల కుమారస్వామి, శ్రీపతి సదానందం, బిక్షపతి, లక్ష్మన్న, సంపత్, అశోక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అందరికీ ప్రసాదం పంపిణీ చేశారు.



## జమ్మికుంటలో ఘనంగా ప్రారంభమైన హనుమాన్ శోభాయాత్ర

**జమ్మికుంట టౌన్ మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా ప్రారంభమైంది. శంకర్ నందన గార్డెన్స్ నుండి ప్రారంభమైన ఈ శోభాయాత్రను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ సేవాసమితి మరియు బ్రదర్స్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శోభాయాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. శ్రీ హనుమాన్ స్వామి ఆశీస్సులతో జమ్మికుంట పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

అలాగే హనుమాన్ భక్తులు, హిందూ బంధువులు, యువకులు మరియు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ, ఎస్ఐతో పాటు అనేక మంది భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

జమ్మికుంట పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా ప్రారంభమైంది. శంకర్ నందన గార్డెన్స్ నుండి ప్రారంభమైన ఈ శోభాయాత్రను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ సేవాసమితి మరియు బ్రదర్స్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శోభాయాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. శ్రీ హనుమాన్ స్వామి ఆశీస్సులతో జమ్మికుంట పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

అలాగే హనుమాన్ భక్తులు, హిందూ బంధువులు, యువకులు మరియు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ, ఎస్ఐతో పాటు అనేక మంది భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం బ్యూరో, మే 5(తెలంగాణ ముచ్చట్లు ):** నెలవారి తనిఖీల్లో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గల ఈ.వి.ఎం. గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గోడౌన్ రూం సీల్ ను పరిశీలించి, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు.

జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ అన్సారి, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# అర్హతే ప్రామాణికం.. మూడు నెలల్లో పరిష్కారం!





- ప్రజా దర్బార్ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అభయం
- సాదాబైనామాలకు 35 రోజుల్లోనే మోక్షం.. అక్రమాలకు తావులేదు

**ఖమ్మం బ్యూరో, మే 5(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుకు మూడు నెలల్లోపు పరిష్కారం చూపుతామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం గ్రామంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆయన పాల్గొని, బాధితుల నుంచి స్వయంగా విన్నపాలను స్వీకరించారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తంటాలతో రైతులు పడుతున్న ఇబ్బందులను తాము 'భూ భారతి' ద్వారా తొలగిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా సాదాబైనామా దరఖాస్తులను అర్హత మేరకు రాబోయే 35 రోజుల్లో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అయితే, సాదాబైనామా పేరుతో ప్రభుత్వ భూములను కాజేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అటువంటి దరఖాస్తులను తిరస్కరిస్తామని గట్టిగా హెచ్చరించారు.

ప్రజల ముంగిటకే పాలన

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు, మహిళలు, నిరుద్యోగ యువత పక్షాన ప్రభుత్వం నిలబడుతుందని మంత్రి పునరుద్ఘాటించారు. ఇప్పటి వరకు నిర్వహించిన 7 క్లస్టర్ల పరిధిలో వచ్చిన పది వేల దరఖాస్తులలో 5 వేల వరకు ఇందిరమ్మ ఇళ్ల కోసమే రావడం ప్రజల అవసరాన్ని సూచిస్తోందని, వీటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్ల తొలగింపు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్ , వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్ ఘటనపై చురుకైన స్పందన

## రైతులకు అండ





**జమ్మికుంట టౌన్ మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం గోపాలపురం గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా పంటలు కాలిపోయిన ఘటనపై వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం స్పందించారు. ఘటన స్థలానికి చేరుకుని నష్టపోయిన పంటలను పరిశీలించి, బాధిత రైతులను పరామర్శించారు.

ఈ సందర్భంగా రైతుల ఆవేదనను విన్న చైర్మన్, వారికి ధైర్యం చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించి, నష్టాన్ని అంచనా వేయించి త్వరితగతిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే ఈ విషయాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు దృష్టికి తీసుకువెళ్లి, బాధిత రైతులకు తప్పకుండా నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం వారి వెంట ఉంటుందని భరోసా ఇస్తూ చైర్మన్ స్వప్న సదానందం వారికి ఆత్మస్థైర్యం నింపారు.

# ఎమ్మెల్యే కడియంను కలిసిన శ్రమ శక్తి అవార్డు గ్రహీత



**హన్మకొండ,మే5(తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల మేడే సందర్భంగా శ్రమ శక్తి అవార్డు అందుకున్న భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి మంగళవారం హనుమకొండలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న విషయాన్ని తెలియజేసి, కార్మికుల తరపున కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. అనంతరం నల్ల స్వామిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నరపు మహేందర్, వరంగల్ జిల్లా కార్యదర్శి ఎడ్ల బుగులయ్య, ధర్మసాగర్ మండల కార్యదర్శి బొల్లేపాక వెంకట స్వామి, తాటికాయల గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లేపాక యాదగిరి, తాటికాయల ఎస్సీ కాలనీ అధ్యక్షుడు బొల్లేపాక నగేష్, తాటికాయల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ రవీందర్, ఉపాధ్యక్షుడు నల్ల మొగిలి, తాటికాయల మాజీ సర్పంచ్ పెసరు రమేష్, రాయగూడెం మాజీ సర్పంచ్ వాంకుడొత్ మొగిలి, కాంగ్రెస్ నాయకులు కనుకటి యాదగిరి, నల్ల నారాయణ, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు దుబాల సుమన్, పట్ల రామచందర్, కార్మిక సంఘ నాయకులు జీడి బద్రయ్య, పట్ల శ్రీనివాస్, పట్ల రాజమొగిలి, ఎర్ర సుధాకర్ పాల్గొన్నారు.

## జమ్మికుంట సహకార సంఘంలో కీలక మార్పు



- పాత టీమ్‌కు మళ్లీ అవకాశం

**జమ్మికుంట టౌన్ మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ సహకార సంఘంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పదవీకాలం ముగిసిన అనంతరం పాత పాలకవర్గానికి తిరిగి బాధ్యతలు అప్పగించాలని కోర్టు ఆదేశాలు జారీ కావడంతో, చైర్మన్‌గా పొనగంటి సంపత్ మళ్లీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ పరిణామంతో గ్రామ ప్రజలు, ముఖ్యంగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాలకవర్గం చేపట్టిన కార్యక్రమాలు, రైతులకు అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ మళ్లీ అదే నాయకత్వం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించనున్న పాలకవర్గం, రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని వెల్లడించింది. రైతుల సంక్షేమం, సహకార వ్యవస్థ బలోపేతం తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పాలకవర్గం మాట్లాడుతూ, "రైతుల ప్రయోజనాల కోసం మళ్లీ బాధ్యతలు చేపట్టే అవకాశం రావడం ఆనందంగా ఉంది. మాపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరి విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రైతులకు మేలు జరిగేలా కృషి చేస్తాం" అని తెలిపారు.ఈ నిర్ణయంతో జమ్మికుంట వ్యవసాయ సహకార సంఘంలో కొత్త ఉత్సాహం నెలకొంది. రైతులకు మరింత లాభదాయకమైన పథకాలు, సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా



- అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల. మే 05(తెలంగాణ ముచ్చట్లు):** రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ లోని మంచిర్యాల జోన్ పరిధిలో ప్రత్యేక చర్యలు చేపట్టారు, ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాపన్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పర్యవేక్షించారు, అనంతరం చెక్‌పోస్ట్ వద్ద ఉన్న భద్రతా చర్యలను పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు, పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని తెలిపారు, అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు, విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు, కార్యక్రమంలో చెన్నూర్ సిఐ బన్సీలాల్, కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# తరచుగా ఉద్యోగాలు మారితే లోన్ రావడం కష్టమా..?

అత్యవసర అవసరాల కోసం చాలామంది వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కొన్ని నిమిషాల్లోనే లోన్ మంజూరు చేస్తున్నప్పటికీ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. ముఖ్యంగా ఉద్యోగ స్థిరత్వం, జీతం, సిబిల్ స్కోర్ వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

నిపుణుల ప్రకారం తరచుగా ఉద్యోగాలు మారే వ్యక్తులకు రుణం మంజూరు కావడం కాస్త కష్టమవుతుంది. బ్యాంకులు అభ్యర్థి ఉద్యోగ చరిత్రను పరిశీలిస్తాయి. ఒకే ఉద్యోగంలో ఎక్కువ కాలం కొనసాగితే ఆర్థిక స్థిరత్వం ఉందని భావించి లోన్ త్వరగా మంజూరు చేస్తాయి. కానీ తరచుగా కంపెనీలు మారితే రుణం తిరస్కరణకు అవకాశం పెరుగుతుంది.

కొత్త ఉద్యోగంలో చేరిన వెంటనే దరఖాస్తు చేస్తే బ్యాంకులు దానిని అనిశ్చిత కాలంగా పరిగణిస్తాయి. సాధారణంగా కనీసం ఆరు నెలలు ఒకే ఉద్యోగంలో కొనసాగిన తర్వాతే రుణం కోసం దరఖాస్తు చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రొబేషన్ పీరియడ్‌లో ఉన్న ఉద్యోగులకు కూడా రుణం మంజూరు అయ్యే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ఉద్యోగ స్థిరత్వంపై స్పష్టత లేకపోవడంతో బ్యాంకులు రిస్క్‌గా భావిస్తాయి.

అలాగే కాంట్రాక్ట్ లేదా ఫ్రీలాన్స్ ఉద్యోగాల్లో ఉన్నవారికి కూడా రుణాలు పొందడం కష్టం. అంతేకాకుండా సిబిల్ స్కోర్ కూడా కీలకంగా మారింది. మంచి క్రెడిట్ స్కోర్ మరియు సక్రమంగా ఉన్న క్రెడిట్ హిస్టరీ ఉంటేనే రుణం త్వరగా లభించే అవకాశం ఉంటుంది. ఒకేసారి అనేక బ్యాంకులకు దరఖాస్తు చేయడం కూడా క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మొత్తానికి ఉద్యోగ స్థిరత్వం, ఆర్థిక ప్రవర్తన, సిబిల్ స్కోర్‌ఇవి కలిపి వ్యక్తిగత రుణం మంజూరులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి.




# వాట్సప్‌లోనే మొబైల్ రీఛార్జ్..

ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ వినియోగదారులకు మరో సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై మొబైల్ రీఛార్జ్ కోసం ఇతర యూపీఐ యాప్స్ లేదా టెలికాం వెబ్‌సైట్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా వాట్సప్‌లోనే రీఛార్జ్ చేసుకునే అవకాశం కల్పించింది.

ఈ కొత్త ఫీచర్ ద్వారా ప్రీపెయిడ్ మొబైల్ నంబర్లకు సెకన్లలోనే రీఛార్జ్ పూర్తిచేయవచ్చు. వాట్సప్ హోమ్ స్క్రీన్‌లో కనిపించే రూపాయి గుర్తుపై క్లిక్ చేసి మొబైల్ రీఛార్జ్ ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా ఈ సేవను ఉపయోగించవచ్చు. తరువాత మొబైల్ నంబర్ నమోదు చేసి, నెట్‌వర్క్ ఎంచుకుని అందుబాటులో ఉన్న ప్లాన్లలో ఒకదాన్ని సెలెక్ట్ చేయాలి. చివరగా యూపీఐ ద్వారా చెల్లింపు పూర్తిచేయడంతో రీఛార్జ్ ఆటోమేటిక్‌గా పూర్తవుతుంది.

ఈ సేవను పేయూ సంస్థతో కలిసి వాట్సప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి ప్రధాన నెట్‌వర్క్‌లకు ఈ ఫీచర్ పని చేస్తోంది. వినియోగదారులు తమ కుటుంబ సభ్యుల మొబైల్ నంబర్లకు కూడా రీఛార్జ్ చేయవచ్చు.

ప్రస్తుతం ఈ ఫీచర్ టెస్ట్ దశలో ఉండటంతో కొంతమంది వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. త్వరలోనే పూర్తిస్థాయిలో అందరికీ విడుదల చేయనున్నట్లు సమాచారం.

వాట్సప్ ఇప్పటికే యూపీఐ చెల్లింపులు, స్కానర్ ద్వారా పేమెంట్స్, మెట్రో టికెట్ బుకింగ్ వంటి సేవలను అందిస్తోంది. ఇప్పుడు రీఛార్జ్ ఫీచర్ కూడా చేరడంతో వినియోగదారులకు మరింత సౌలభ్యం కలుగనుంది.

ఆండ్రాయిడ్ మరియు ఐఓఎస్ వినియోగదారులందరికీ ఈ సేవ త్వరలో అందుబాటులోకి రానుంది. డిజిటల్ చెల్లింపులను మరింత సులభతరం చేయడమే ఈ కొత్త ఫీచర్ ప్రధాన లక్ష్యమని వాట్సప్ పేర్కొంది.

# డాలర్ల కోసం ఆర్బీఐ కొత్త వ్యూహాలు.. ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి

కరెన్సీ మార్కెట్‌లో డాలర్ బలపడుతున్న నేపథ్యంలో రూపాయి విలువ మరింత ఒత్తిడికి లోనవుతోంది. ఈ పరిస్థితుల్లో దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలను పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కొత్త మార్గాలను అన్వేషిస్తున్నట్లు సమాచారం.



ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితులు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అలాగే ముడి చమురు ధరల పెరుగుదల రూపాయిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాలతో దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఫలితంగా దేశీయ ఫారెక్స్ రిజర్వులపై ఒత్తిడి ఏర్పడుతోంది.

ఇటీవల రూపాయి డాలర్‌తో పోలిస్తే ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరుకోవడం గమనార్హం. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కూడా పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. గత కొన్ని నెలల్లో విదేశీ మదుపర్లు బిలియన్ల డాలర్ల పెట్టుబడులను భారత మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకున్నారు.

ఈ నేపథ్యంలో ఆర్బీఐ డాలర్ల ప్రవాహాన్ని పెంచేందుకు పలు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తోంది. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి డాలర్ డిపాజిట్లు స్వీకరించడం, అలాగే విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేలా పన్ను విధానాల్లో మార్పులు చేయడం వంటి అంశాలు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

ఇటీవలి కాలంలో ఫారెక్స్ రిజర్వులు గరిష్ఠ స్థాయికి చేరుకున్నప్పటికీ, ఆ తర్వాత కొద్ది నెలల్లోనే గణనీయంగా తగ్గాయి. దీనికి అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

ఆర్బీఐ వద్ద ఉన్న విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సీఏ) తగ్గడం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఇవే దిగుమతులు, చమురు చెల్లింపులకు ప్రధాన ఆధారం కావడంతో వీటి తగ్గుదల ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది.

మొత్తానికి రూపాయి స్థిరత్వాన్ని కాపాడుతూ డాలర్ల ప్రవాహాన్ని పెంచడం ఆర్బీఐకి పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో తీసుకోబోయే కొత్త నిర్ణయాలు భారత ఆర్థిక వ్యవస్థపై కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది.

# రుణమాఫీ పేరుతో మోసాలకు దూరంగా ఉండండి..

రుణాలు మాఫీ చేయిస్తామని చెబుతూ జరుగుతున్న తప్పుడు ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) హెచ్చరించింది. ఇలాంటి మోసపూరిత హామీలను నమ్మి ఎవరికీ డబ్బులు చెల్లించవద్దని స్పష్టం చేసింది.

సామాజిక మాధ్యమాలు, వ్యక్తిగత సందేశాల ద్వారా కొందరు కేటుగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని రుణమాఫీ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని ఆర్బీఐ పేర్కొంది. ఈ తరహా తప్పుడు ప్రచారాలు ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికే కాకుండా సాధారణ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపింది.

బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల వద్ద ఉన్న రుణాలను పూర్తిగా మాఫీ చేయిస్తామని చెప్పే వ్యక్తులు, సంస్థలు పూర్తిగా నమ్మదగిన వారు కాదని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఇలాంటి హామీలు ఇచ్చే వారిని నమ్మి ఆర్థిక లావాదేవీలు చేయరాదని ప్రజలకు సూచించింది.

ఇలాంటి మోసాలు కొనసాగితే దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థపై విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆర్బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. డిపాజిటర్ల ప్రయోజనాలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని పేర్కొంది.




అలాగే మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్బీఐ హెచ్చరించింది.

మొత్తానికి రుణమాఫీ పేరుతో వచ్చే ప్రకటనలు, ఆఫర్ల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆర్బీఐ మరోసారి స్పష్టం చేసింది.



# సైన్యంలోకి మహీంద్రా థార్ ఏటీవీ..

భారత సైన్యం కోసం మహీంద్రా డిఫెన్స్ విభాగం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన కొత్త టాక్టికల్ వాహనం 'మహీంద్రా ఏటీవీ'ను ఆవిష్కరించింది. ఈ వాహనం మహీంద్రా థార్ రాక్స్ ప్లాట్‌ఫామ్‌పై ఆధారపడి రూపొందించబడింది.

మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా ఈ వాహనాన్ని సోషల్ మీడియా వేదికగా పరిచయం చేశారు. ఇది సంస్థ డీఎన్ఏకు ప్రతీక అని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా పనిచేయగల సామర్థ్యం ఈ వాహనంలో ఉందని ఆయన పేర్కొన్నారు.

ఈ ఏటీవీని ప్రత్యేకంగా భద్రతా దళాల అవసరాలకు అనుగుణంగా రూపొందించారు. ఇందులో గన్ మౌంట్, బలమైన రోల్ కేజ్, పూర్తి అండర్‌బాడీ ప్రొటెక్షన్ వంటి కీలక రక్షణ ఫీచర్లు ఉన్నాయి. ముందు, వెనుక భాగాల్లో హెవీ-డ్యూటీ బంపర్లు, టో షాకిల్స్, స్పేర్ టైర్ క్యారియర్, ఇంధన క్యాన్ హోల్డర్ వంటి సదుపాయాలు అమర్చారు.

వాహనంలో 2.2 లీటర్ల డీజిల్ ఇంజిన్ ఉండి, అధిక శక్తి మరియు టార్క్‌ను అందిస్తుంది. కఠినమైన భూభాగాల్లో సులభంగా ప్రయాణించేందుకు ప్రత్యేక ఆఫ్-రోడ్ టైర్లు, స్టీల్ వీల్స్ అమర్చారు. రాత్రి ఆపరేషన్ల కోసం బ్లాక్‌అవుట్ లైట్లు, అలాగే విమానం నుంచి నేరుగా దించేందుకు వీలైన 'ఎయిర్‌డ్రాప్ రెడీ' సామర్థ్యం కూడా ఇందులో ఉంది.

మొత్తానికి, మహీంద్రా ఏటీవీ సైనిక అవసరాలకు అనుగుణంగా అత్యంత పటిష్ఠంగా రూపొందించబడిన వాహనంగా నిలుస్తోంది.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ప్రకృతి ఒడిలో ప్రశాంతత

## ఇంటి తోటల పెంపకం ఒక అద్భుత చికిత్స
## మొక్కలతో అనుబంధం పెంచుతున్న నగర జీవులు
## మానసిక ఒత్తిడికి సహజ సిద్ధమైన పరిష్కారం
## పచ్చని పరిసరాలతో మెరుగుపడుతున్న ఆరోగ్యం

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి నిరంతరం ఒత్తిడికి లోనవుతున్నాడు. కాంక్రీట్ వనాల మధ్య బతుకుతున్న నగరవాసికి ప్రకృతితో సంబంధం తెగిపోతోంది. ఇటువంటి తరుణంలో ఇంటి తోటల పెంపకం ఒక గొప్ప ఊరటగా మారుతోంది. బాల్కనీలోనో లేదా ఇంటి పైకప్పు పైనో చిన్నపాటి తోటను ఏర్పాటు చేసుకోవడం వల్ల మనసుకు ఎంతో హాయి లభిస్తుంది. ఉదయాన్నే లేవగానే పచ్చని మొక్కలను చూడటం వల్ల మెదడు ఉత్తేజితం అవుతుంది. ఇది కేవలం ఒక హాబీ మాత్రమే కాదు, మనిషిని తన మూలాలకు దగ్గర చేసే ఒక చక్కని మార్గం. మొక్కల పెంపకం మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని అనేక పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. మట్టిని తాకడం, మొక్కలకు నీరు పోయడం వంటి పనుల వల్ల శరీరంలో ఒత్తిడిని తగ్గించే హార్మోన్లు విడుదలవుతాయి. రోజువారీ పనిలో ఉండే ఆందోళనలను మర్చిపోవడానికి తోటపని ఎంతో సహాయపడుతుంది. మొక్కలు ఎదిగే క్రమాన్ని గమనించడం వల్ల ఓర్పు, సహనం అలవడతాయి. ఏదో ఒక సృజనాత్మక పనిలో నిమగ్నమై ఉన్నామనే భావన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఒంటరితనంతో బాధపడే వారికి మొక్కలు మంచి స్నేహితుల్లా తోడుంటాయి.

ఇంటి తోటలు గాలిలోని కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయి. మనం పీల్చే గాలి నాణ్యత పెరగడం వల్ల శ్వాసకోశ సమస్యలు తగ్గుముఖం పడతాయి. ఇండోర్ ప్లాంట్లు గదిలోని ఉష్ణోగ్రతను తగ్గించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తాయి. రాత్రిపూట మంచి నిద్ర పట్టడానికి ఈ పచ్చని పరిసరాలు దోహద పడతాయి. ప్రకృతికి దగ్గరగా ఉండటం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఏ వయసు వారైనా తోటపనిని ఒక వ్యాయామంలా స్వీకరించవచ్చు. ప్రస్తుతం చాలామంది తమ ఇంటి మిద్దెలపై సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిస్తున్నారు. రసాయనాలు లేని స్వచ్ఛమైన ఆహారం లభించడమే కాకుండా ఆర్థికంగా కూడా ఇది ఎంతో లాభదాయకం. సొంతంగా పండించిన కూరగాయలను వండుకుని తినడంలో ఉండే తృప్తి వర్ణనాతీతం. ఇది కుటుంబ సభ్యులందరినీ ఒకే చోట చేర్చి సామూహికంగా పని చేసేలా ప్రోత్సహిస్తుంది. పిల్లలకు చిన్నప్పటి నుండే పర్యావరణంపై అవగాహన కల్పించడానికి ఇది ఒక చక్కని వేదిక. మట్టితో ఆడుకోవడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

తోటపని అనేది ఒక నిశ్శబ్ద ధ్యానం లాంటిది. మొక్కలతో గడిపే సమయం మనల్ని వర్తమానంలో ఉంచుతుంది. అనవసరమైన ఆలోచనలకు స్వస్తి పలికి ఏకాగ్రతను పెంచుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. పూల మొక్కల సువాసనలు మనసును రంజింపజేస్తాయి. ప్రతిరోజూ కొత్త చిగుళ్లను, పూలను చూడటం వల్ల జీవితంపై సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. నగరాల్లో ఉండే కోలాహలం నుండి దూరంగా మనకంటూ ఒక సొంత ప్రపంచాన్ని నిర్మించుకోవచ్చు. ఇది మన అంతరంగంలోని అలజడిని తగ్గించి ప్రశాంతతను చేకూరుస్తుంది. స్థలం తక్కువగా ఉన్నవారు కూడా వర్టికల్ గార్డెనింగ్ పద్ధతిలో మొక్కలను పెంచుకోవచ్చు. గోడలకు వేలాడే కుండీలు, చిన్నపాటి డబ్బాల్లో కూడా మొక్కలు పెంచడం సాధ్యమే. తక్కువ పెట్టుబడితో ఎక్కువ సంతోషాన్ని ఇచ్చే పని ఏదైనా ఉందంటే అది తోటపని మాత్రమే. దీనికోసం ప్రత్యేకమైన నైపుణ్యం అవసరం లేదు, కొంచెం శ్రద్ధ ఉంటే చాలు. రకరకాల ఆకులు, పూల రంగులు కళ్లకు విందు చేస్తూ ఇంటి అందాన్ని రెట్టింపు చేస్తాయి. ప్రకృతిని ప్రేమించే గుణం మనలో మానవత్వాన్ని పెంపొందిస్తుంది. ఆధునిక జీవనశైలిలో ఏర్పడిన శూన్యాన్ని నింపడానికి మొక్కలు ఎంతగానో సహకరిస్తాయి. ఆఫీసు పనుల ఒత్తిడిలో ఉన్నవారు సాయంత్రం వేళ తోటలో గడపడం వల్ల రీఛార్జ్ అయినట్లు భావిస్తారు. డిప్రెషన్, యాంగ్జైటీ వంటి సమస్యలతో పోరాడుతున్న వారికి తోటపని ఒక థెరపీలా పనిచేస్తుంది. ప్రతి రోజూ మొక్కల అవసరాలను తీర్చడం వల్ల బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవడుతుంది. తోటలోని పక్షుల కిలకిలరావాలు మనసుకు కొత్త ఉత్సాహాన్నిస్తాయి. ప్రకృతితో మమేకమవ్వడం వల్ల సహజ సిద్ధమైన జీవన ఆనందం లభిస్తుంది. ఇంటి తోటల పెంపకం అనేది కేవలం అలంకరణ కోసం మాత్రమే కాదు. అది మన శారీరక, మానసిక వికాసానికి అవసరమైన ఒక ముఖ్యమైన ప్రక్రియ. ప్రతి ఇంట్లో కనీసం కొన్ని మొక్కలైనా ఉండటం వల్ల వాతావరణంలో మార్పు వస్తుంది. ఈ అలవాటు మనల్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా భూమిని పచ్చగా మార్చడానికి తోడ్పడుతుంది. నేటి నుండే చిన్న మొక్కతో మీ తోటపనిని ప్రారంభించండి, ఆ పచ్చని చెట్లు ఇచ్చే ప్రశాంతతను అనుభవించండి. ప్రకృతిని కాపాడుకుందాం, మన ఆరోగ్యాన్ని సంరక్షించుకుందాం.




# శరీర ఆకృతి పట్ల సానుకూల దృక్పథం

### అనారోగ్యకరమైన డైటింగ్ పద్ధతులపై అవగాహన
### స్వీయ గౌరవం శారీరక సౌష్టవంపై ప్రత్యేక కథనం
### ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాధాన్యత
### అంతర్జాతీయ నో డైట్ డే

నేటి ఆధునిక ప్రపంచంలో అందం అంటే కేవలం సన్నగా ఉండటమే అనే అపోహ పెరిగిపోతోంది. ఈ క్రమంలో చాలామంది శాస్త్రీయత లేని డైటింగ్ పద్ధతులను అవలంబిస్తూ తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. అంతర్జాతీయ నో డైట్ డే ప్రధాన ఉద్దేశ్యం ఇటువంటి హానికరమైన డైటింగ్ అలవాట్లపై ప్రజల్లో అవగాహన కల్పించడం. ఏ వ్యక్తి అయినా తన శరీర ఆకృతిని బట్టి కాకుండా తన వ్యక్తిత్వాన్ని బట్టి గౌరవించబడాలనే సందేశాన్ని ఈ రోజు బలంగా వినిపిస్తుంది. ప్రతి సంవత్సరం మే 6న ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా బాడీ షేమింగ్ వంటి సామాజిక రుగ్మతలకు చెక్ పెట్టాలని సామాజికవేత్తలు ఆకాంక్షిస్తున్నారు. ఆరోగ్యం అంటే కేవలం బరువు తగ్గడం మాత్రమే కాదు, మానసిక శారీరక సమతుల్యతను కాపాడుకోవడం. కఠినమైన ఆహార నియమాలు పాటించడం వల్ల శరీరానికి అందాల్సిన పోషకాలు అందక నీరసం, ఒత్తిడి వంటి సమస్యలు తలెత్తుతాయి. నో డైట్ డే సందర్భంగా నిపుణులు సూచించేది ఏమిటంటే ఆహారాన్ని శత్రువులా చూడకుండా శరీరానికి అవసరమైన ఇంధనంగా భావించాలి. అనారోగ్యకరమైన సప్లిమెంట్లు, క్రాష్ డైట్‌ల జోలికి వెళ్లకుండా సహజసిద్ధమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందవచ్చు. ఈ రోజు మనల్ని మనం ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించే గొప్ప అవకాశాన్ని కల్పిస్తుంది.

మన శరీర ఆకృతి ఎలా ఉన్నా దాన్ని ప్రేమించడం నేర్చుకోవడమే ఈ దినోత్సవ పరమార్థం. సోషల్ మీడియాలో కనిపించే కృత్రిమ అందాల వెనుక పరిగెత్తకుండా వాస్తవికతను గుర్తించడం ముఖ్యం. చాలామంది యువత సన్నగా కనిపించాలనే ఒత్తిడిలో ఈటింగ్ డిజార్డర్లకు లోనవుతున్నారు. ఇటువంటి వారికి ధైర్యాన్ని ఇస్తూ ప్రతి ఒక్కరి శరీరం విభిన్నమని, విశిష్టమైనదని ఈ రోజు గుర్తు చేస్తుంది. మీ శరీరంపై మీకు ఉండే గౌరవం మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. తద్వారా మీరు సమాజంలో మరింత చురుకుగా వ్యవహరించగలుగుతారు. ఇది కేవలం ఒక రోజు వేడుక కాదు, జీవితాంతం పాటించాల్సిన ఒక జీవన విధానం. వివిధ దేశాల్లో ఈ రోజున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ డైటింగ్ పరిశ్రమ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎండగడతారు. బరువు తగ్గే క్రమంలో మనుషులు పడే వేదనను తగ్గించి పౌష్టికాహారంపై దృష్టి సారించేలా ప్రోత్సహిస్తారు. నీలి రంగు రిబ్బన్‌ను ధరించడం ద్వారా ఈ ఉద్యమానికి మద్దతు తెలుపుతారు. ముఖ్యంగా డైటింగ్ కారణంగా మరణించిన వారికి నివాళులు అర్పిస్తూ భవిష్యత్తు తరాలు అటువంటి తప్పులు చేయకుండా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తారు. ఆహారం అనేది ఆనందానికి మూలం కావాలి తప్ప ఆందోళనకు కారణం కాకూడదనేది అంతర్జాతీయ నో డైట్ డే నినాదం.

ఆరోగ్యకరమైన ఆహారం, సరైన వ్యాయామం అనేవి జీవనశైలిలో భాగం కావాలి తప్ప అవి ఒక శిక్షలా ఉండకూడదు. ఈ మే 6న మనం తీసుకునే నిర్ణయం మన ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా సమాజంలో అందరినీ సమానంగా చూసే దృక్పథాన్ని పెంపొందించాలి. నో డైట్ డే సందర్భంగా అందరూ తమ శారీరక ఆకృతి పట్ల ఉన్న అసంతృప్తిని వీడి సంతోషంగా జీవించాలని నిపుణులు కోరుతున్నారు. మీ శరీరాన్ని గౌరవించండి, అది మీకు ఇస్తున్న సహకారానికి కృతజ్ఞతగా ఉండండి. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రాన్ని పాటిస్తూ ముందుకు సాగడమే ఈ రోజు మనం ఇచ్చే నిజమైన సందేశం.

# సాంకేతిక విప్లవం 6జీ సేవలకు సిద్ధమవుతున్న అగ్ర దేశాలు

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 5జీ సేవలు విస్తరిస్తున్నప్పటికీ, అగ్ర దేశాలు అప్పుడే తదుపరి తరం వైర్‌లెస్ సాంకేతికత అయిన 6జీ వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి. 2026 సంవత్సరం 6జీ ప్రస్థానంలో ఒక కీలకమైన మలుపుగా మారనుంది, ఎందుకంటే ఈ ఏడాదిలో పరిశోధన పత్రాల స్థాయి నుండి ఈ సాంకేతికత ప్రభుత్వ విధానాలు గ్లోబల్ స్టాండర్డ్స్ స్థాయికి చేరుకుంటోంది. 6జీ నెట్‌వర్క్ 5జీ కంటే సుమారు 100 రెట్లు వేగంగా, సెకనుకు 1 టెరాబిట్ వేగంతో డేటాను బదిలీ చేయగలదని అంచనా. ఇది కేవలం ఇంటర్నెట్ వేగాన్ని పెంచడమే కాకుండా, కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలకనుంది. 6జీ అభివృద్ధిలో ప్రస్తుతం దక్షిణ కొరియా, చైనా, జపాన్, అమెరికా, ఫిన్లాండ్ వంటి దేశాలు ముందంజలో ఉన్నాయి. ఈ దేశాలు ఇప్పటికే బిలియన్ల కొద్దీ డాలర్లను 6జీ మౌలిక సదుపాయాల కల్పన కోసం కేటాయించాయి. ముఖ్యంగా చైనా, దక్షిణ కొరియా 2030 నాటికి వాణిజ్యపరంగా 6జీ సేవలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. టెరాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను ఉపయోగించడం ద్వారా అత్యంత తక్కువ లాటెన్సీ తో డేటా ప్రసారం చేయడం




ఈ దేశాల ప్రధాన ఉద్దేశం. ఈ పోటీ కేవలం సాంకేతిక అప్‌గ్రేడ్ మాత్రమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై పట్టు సాధించే వ్యూహంగా కూడా కనిపిస్తోంది. భారతదేశం కూడా 6జీ రేసులో తన ఉనికిని చాటుకుంటోంది. భారత ప్రభుత్వం ఇప్పటికే 'భారత్ 6జీ విజన్' డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. ఫిబ్రవరి 2026 నాటికి, 6జీ పరిశోధన అభివృద్ధి కోసం దాదాపు 104 ప్రాజెక్టులకు సుమారు ₹271 కోట్ల నిధులను మంజూరు చేసింది. 5జీ విస్తరణలో ప్రపంచ రికార్డు సృష్టించిన ఉత్సాహంతో, ఇప్పుడు అంతర్జాతీయ 6జీ ప్రమాణాల రూపకల్పనలో భారత్ తొలిసారిగా భాగస్వామి అవుతోంది. 30కి పైగా దేశాలతో పొత్తులు పెట్టుకుంటూ, స్వదేశీ పరిజ్ఞానంతో 6జీ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 6జీ సాంకేతికత కేవలం ఫోన్ కాల్స్ లేదా వీడియో స్ట్రీమింగ్‌కు మాత్రమే పరిమితం కాదు. ఇది హోలోగ్రాఫిక్ కమ్యూనికేషన్, డిజిటల్ ట్విన్స్ అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన అప్లికేషన్లకు మద్దతు ఇస్తుంది. ఉదాహరణకు, 6జీ సాయంతో దూరంగా ఉన్న వ్యక్తులు హోలోగ్రామ్ రూపంలో మన కళ్ల ముందే ఉన్నట్లుగా సంభాషించవచ్చు. అలాగే, శస్త్రచికిత్సలు చేసే సమయంలో రోబోలను రియల్ టైమ్‌లో నియంత్రించడానికి ఈ నెట్‌వర్క్ ఎంతో ఉపయోగపడుతుంది. ఏఐ అనేది 6జీ నెట్‌వర్క్‌లో ఒక అంతర్భాగంగా ఉండి, నెట్‌వర్క్ రద్దీని అంచనా వేయడం ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి పనులను స్వయంచాలకంగా చేస్తుంది. ప్రస్తుతం 2026నుండి 2028 మధ్య కాలంలో 6జీ ప్రోటోటైప్ టెస్టింగ్ ట్రయల్స్ నిర్వహించాలని అంతర్జాతీయ సంస్థలు భావిస్తున్నాయి. పూర్తి స్థాయిలో వాణిజ్యపరంగా 6జీ సేవలు 2030 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ సాంకేతికత అమలులో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. టెరాహెర్ట్జ్ తరంగాలు తక్కువ దూరం మాత్రమే ప్రయాణించగలవు మరియు భవనాల వంటి అడ్డంకులను దాటడం వీటికి కష్టం. వీటిని అధిగమించేందుకు శాస్త్రవేత్తలు 'ఇంటెలిజెంట్ రిఫ్లెక్టింగ్ సర్ఫేసెస్' వంటి కొత్త ఆవిష్కరణలపై పనిచేస్తున్నారు. భవిష్యత్తులో మన జీవనశైలిని పూర్తిగా మార్చేసే ఈ సాంకేతిక విప్లవం కోసం ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# సీఎం స్టాలిన్ రాజీనామా

- ఎన్నికల్లో ఘోర పరాజయం ప్రభావం
- విజయ్ ద్విగుణ విజయం సంచలనం



**చెన్నై, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఘోర పరాజయం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథన్ అర్లేకర్కు సమర్పించారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే వరకు తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగనున్నారు. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన స్టాలిన్ ఈసారి ఓటమి పాలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్న నాయకుడే తన నియోజకవర్గంలో ఓడిపోవడం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు.

ఇక ఈ ఎన్నికల్లో నటుడురాజకీయ నాయకుడు విజయ్ రెండు స్థానాల్లో పోటీ చేసి రెండింటిలోనూ విజయం సాధించడం విశేషంగా నిలిచింది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో కొత్త శక్తి ఎదుగుదలకు సంకేతంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఫలితాలతో తమిళనాడులో అధికార మార్పిడి దిశగా పరిణామాలు వేగంగా సాగుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాజకీయ సమీకరణాలు మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్నాయి. ప్రజల తీర్పుతో ఏర్పడిన ఈ మార్పులు భవిష్యత్ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి.

# కేఎంపీ ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం

- స్కార్పియో ఢీకొని అయిదుగురు పోలీసులు మృతి
- ఓవర్‌టేక్ ప్రయత్నంలో అదుపు తప్పిన వాహనం
- నుహ్ జిల్లాలో విషాద ఘటన



**నుహ్, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** హర్యానాలోని నుహ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కుండలిమనేసర్‌పల్వాల్ కేఎంపీ ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అయిదుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. వేగంగా వెళ్తున్న వాహనం అదుపు తప్పడంతో ఈ దుర్ఘటన జరిగింది.

తౌరు సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దులావత్ టోల్ ప్లాజా సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, అత్యవసర సేవా బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్ జిల్లాకు చెందిన పోలీసులు మహేంద్ర స్కార్పియో వాహనంలో పల్వాల్ వైపు ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. టోల్ ప్లాజా సమీపంలో మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో వాహనం అదుపు తప్పినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

అదుపు తప్పిన స్కార్పియో ముందున్న వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఎస్‌యూవీ పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న అయిదుగురు పోలీసులు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనాస్థలం వద్ద పరిస్థితి హృదయ విదారకంగా మారింది. వాహన శిథిలాల్లో చిక్కుకున్న మృతదేహాలను పోలీసులు బయటకు తీశారు. మృతుల వివరాలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు అధికారులు తెలిపారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను వెలికితీసేందుకు విచారణ కొనసాగుతోంది.

# తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు పరుగులు

**టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరణ**
**గవర్నర్‌ను కలిసేందుకు విజయ్ ప్రయత్నాలు**
**మెజారిటీకి దూరంలో కీలక సమీకరణాలు**



**చెన్నై, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. తమిళగ వెట్రి కజగం పార్టీ 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. దీంతో ఆ పార్టీ అధినేత విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథన్ అర్లేకర్కు విజయ్ లేఖ రాశారు. లోక్‌భవన్‌కు ఈమెయిల్ పంపి, ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం ఇవ్వాలని కోరారు. 108 స్థానాలతో తమ పార్టీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. అయితే శాసనసభలో మెజారిటీ నిరూపణకు మరింత సమయం ఇవ్వాలని విజయ్ తన లేఖలో విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. 15 రోజుల్లో తమ సంఖ్యాబలం చూపిస్తామని, తగిన అవకాశాన్ని కల్పించాలని కోరారు.

లోక్‌భవన్ వర్గాల సమాచారం ప్రకారం, విజయ్‌కు త్వరలోనే గవర్నర్ నుంచి ఆహ్వానం వచ్చే అవకాశం ఉంది. బలనిరూపణకు 7 నుంచి 15 రోజుల గడువు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు కోసం అవసరమైన మెజారిటీ 118 స్థానాలు కాగా, టీవీకే ఆ సంఖ్యకు 10 సీట్ల దూరంలో నిలిచింది. దీంతో ఇతర పార్టీల మద్దతు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో ఎవరు టీవీకేకు మద్దతు ఇస్తారనే అంశంపై ఆసక్తి నెలకొంది. టీవీకే శాసనసభా పక్ష నాయకుడిగా విజయ్‌ను ఎమ్మెల్యేలు ఎన్నుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు

- ఇరాన్ బోట్లపై అమెరికా దాడి
- నౌకల రక్షణకు ప్రాజెక్ట్ ఫ్రీడమ్ చర్యలు
- సీజ్‌ఫైర్ భవితవ్యంపై అనిశ్చితి



**వాషింగ్టన్, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌కు చెందిన ఏడు ఫాస్ట్ బోట్లను పేల్చివేసినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం జలసంధి మూసివేయబడటంతో అక్కడ చిక్కుకున్న నౌకలను సురక్షితంగా తరలించేందుకు అమెరికా చర్యలు చేపట్టింది. యూఏఈ, దక్షిణ కొరియా దేశాలకు చెందిన నౌకలపై దాడులు జరిగినట్లు సమాచారం. ఇరాన్ దాడుల కారణంగా యూఏఈలోని ఫుజైరా ఆయిల్ పోర్టు వద్ద భారీగా మంటలు వ్యాపించినట్లు అధికారులు పేర్కొన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అంతర్జాతీయ ఆందోళనలు పెరిగాయి. ప్రాజెక్ట్ ఫ్రీడమ్ పేరుతో అమెరికా కొన్ని నౌకలను హోర్ముజ్ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నది. ఇందులో భాగంగా మెయర్స్ కంపెనీకి చెందిన భారీ నౌక కూడా విజయవంతంగా జలసంధిని దాటినట్లు వెల్లడించారు. నౌకల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ పరిస్థితికి సైనిక చర్యల ద్వారా పరిష్కారం సాధ్యం కాదని ఇరాన్ మంత్రి అబ్బాస్ అరగాచి తెలిపారు. రాజకీయ పరిష్కారమే అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. పరిస్థితి మరింత దిగజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల అమెరికాఇరాన్ మధ్య కుదిరిన సీజ్‌ఫైర్ భవితవ్యంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. యూఏఈపై డ్రోన్, మిస్సైల్ దాడుల నేపథ్యంలో ఆ ఒప్పందం అమలులో ఉందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనలపై అమెరికా అడ్మిరల్ బ్రాడ్ కూపర్ స్పందిస్తూ, తమ రక్షణలో ఉన్న నౌకలపై దాడి ప్రయత్నాలను అడ్డుకున్నామని తెలిపారు. పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# ఇంటి పనుల నుంచి శాసనసభకు

- కవితా మాజీ విజయం స్ఫూర్తిదాయకం
- బీజేపీ విజయంలో కొత్త ముఖంగా కవితా మాజీ
- రూ.2,500 జీతం నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదుగుదల
- పట్టుదల, కృషితో సాధించిన విజయగాథ



**కోల్‌కతా, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 294 స్థానాలకు గానూ 206 సీట్లు గెలుచుకుని రాష్ట్ర రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించింది. ఈ విజయంతో అనేక కొత్త నాయకులు వెలుగులోకి రాగా, అందరిలో ప్రత్యేకంగా నిలిచిన పేరు కవితా మాజీ. ఒకప్పుడు ఇంటి పనులు చేస్తూ జీవనం సాగించిన ఆమె ఇప్పుడు శాసనసభ్యురాలిగా ఎన్నిక కావడం విశేషం. ఆస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కవితా మాజీ విజయం సాధించడంతో ఆమె జీవితం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గతంలో ఆమె ఇంటి పనులు చేస్తున్నప్పటి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ పీసీ మోహన్ ఆమె ప్రయాణాన్ని ప్రశంసిస్తూ, సామాన్య మహిళ కూడా రాజకీయాల్లో ఉన్నత స్థాయికి చేరగలదని వ్యాఖ్యానించారు. కవితా మాజీ దాదాపు రెండు దశాబ్దాల పాటు కుటుంబ పోషణ కోసం ఇళ్లలో పాత్రలు కడుగుతూ, ఇతర పనులు చేస్తూ జీవనం సాగించారు. బర్ధమాన్ జిల్లాలోని ఆస్‌గ్రామ్ ప్రాంతానికి చెందిన ఆమె భర్త సుబ్రతా మాజీ రోజువారీ కూలీగా పనిచేస్తున్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆమె ప్రజలతో నేరుగా మమేకమవుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి శ్యామ ప్రసన్న లహోరిపై 12,535 ఓట్ల మెజారిటీతో కవితా మాజీ గెలుపొందారు. లక్షకు పైగా ఓట్లు సాధించడం ఆమె ప్రజాదరణకు నిదర్శనంగా నిలిచింది. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. గత దశాబ్ద కాలంగా ఆమె రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. బూత్ స్థాయి కార్యకర్తగా ప్రారంభమైన ఆమె ప్రయాణం, క్రమంగా అభ్యర్థి స్థాయికి చేరింది. 2021 ఎన్నికల్లో ఓటమి ఎదురైనా వెనుకడుగు వేయకుండా కృషి కొనసాగించి ఈసారి విజయాన్ని అందుకున్నారు. ఆమె పట్టుదల రాజకీయాల్లో స్థిరపడేలా చేసింది. ఆమె అఫిడవిట్ ప్రకారం పెద్ద ఆస్తులు లేని సాధారణ జీవితం గడుపుతున్నప్పటికీ, కృషి, పట్టుదలతో శాసనసభకు ఎన్నిక కావడం ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచింది. సామాన్య మహిళ కూడా ఉన్నత స్థానాలను అందుకోగలదని ఆమె విజయగాథ స్పష్టంగా చూపిస్తోంది.

# చైనాలో బాణాసంచా ఫ్యాక్టరీ పేలుడు

- 21 మంది మృతి, 61 మందికి గాయాలు
- భారీ స్థాయిలో రెస్క్యూ ఆపరేషన్
- బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశాలు



**బీజింగ్, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** చైనాలోని హునాన్ ప్రావిన్స్లో భారీ పేలుడు సంభవించి విషాదాన్ని మిగిల్చింది. హువాషెంగ్ ఫైర్‌వర్క్స్ ప్లాంట్‌లో జరిగిన ఈ ప్రమాదంలో 21 మంది మృతి చెందగా, మరో 61 మంది గాయపడ్డారు. లియుయాంగ్ నగరంలో సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. పేలుడు తీవ్రత భారీగా ఉండటంతో సుమారు 3 కిలోమీటర్ల పరిధిలో సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స అందించేందుకు దాదాపు 500 మంది సిబ్బంది రంగంలోకి దిగారు. ఫ్యాక్టరీలో చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి అత్యాధునిక రోబోలను కూడా ఉపయోగించారు.

ఈ ప్రమాదంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పేలుడు తీవ్రత కారణంగా సమీప భవనాల కిటికీలు ధ్వంసమయ్యాయి. ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న రెండు గన్‌పౌడర్ గోదాములు రెస్క్యూ చర్యలకు అడ్డంకిగా మారినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫైర్‌వర్క్స్ కంపెనీ ఇన్‌చార్జిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పందించి వెంటనే సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ దుర్ఘటన చైనాలో పారిశ్రామిక భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- ఫుజైరా దాడితో పరిస్థితులు తీవ్రం
- ముగ్గురు భారతీయులు గాయంపై భారత్ ఆగ్రహం
- శాంతి చర్చలకు భారత్ మద్దతు



**న్యూఢిల్లీ, మే 05 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో యూఏఈలోని ఫుజైరా పెట్రోలియం ఇండస్ట్రీస్ జోన్పై జరిగిన దాడి పరిస్థితులను మరింత దిగజార్చింది. ఈ ఘటనలో ముగ్గురు భారతీయులు గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "పౌర మౌలిక సదుపాయాలు, అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ఏ విధంగానూ అంగీకారయోగ్యం కాదు" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పష్టం చేశారు. వెంటనే ఈ ఘర్షణలను నిలిపివేయాలని పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం అత్యంత అవసరమని భారత్ పేర్కొంది. సమస్యలను యుద్ధ మార్గంలో కాకుండా దౌత్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది. అంతర్జాతీయ సమాజం కూడా ఈ దిశగా కృషి చేయాలని కోరింది. అంతేకాకుండా హర్మూజ్ జలసంధి మీదుగా స్వేచ్ఛాయుత నౌకాయానం, వాణిజ్యం కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని భారత్ అభిప్రాయపడింది. ఈ మార్గం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకమని, ఎలాంటి అంతరాయం కలగకూడదని స్పష్టం చేసింది. పరిస్థితులు మరింత విషమించకుండా శాంతియుత పరిష్కారాల కోసం జరుగుతున్న చర్చలకు భారత్ పూర్తి మద్దతు ప్రకటించింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ పరిణామాలు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనకు గురిచేస్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గి శాంతి నెలకొనేలా దేశాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మళ్లీ కలిసిన చరణ్–సుకుమార్

టాలీవుడ్‌లో విజయవంతమైన కాంబినేషన్‌లలో ఒకటిగా నిలిచిన రామ్ చరణ్-సుకుమార్ జోడీ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. వీరిద్దరి కలయికలో వచ్చిన రంగస్థలం చిత్రం అప్పట్లో భారీ విజయాన్ని అందుకుని, విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు అదే కాంబోలో కొత్త చిత్రం తెరకెక్కనుండటంతో సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది.

ప్రస్తుతం 'ఆర్‌సీ 17' (వర్కింగ్ టైటిల్) పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా చిత్రీకరణ జూలై నెలలో ప్రారంభం కానుందని తెలుస్తోంది. ఇప్పటికే దర్శకుడు సుకుమార్ కథను పూర్తి చేసి, స్క్రిప్ట్‌కు చివరి మెరుగులు దిద్దుతున్నట్లు సమాచారం. కథాంశం విషయానికి వస్తే, 'రంగస్థలం' తరహాలోనే గ్రామీణ నేపథ్యంతో పాటు భావోద్వేగాలు, మాస్ అంశాలు కలగలిపి రూపొందించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ చిత్రానికి సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందించనుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గతంలో 'రంగస్థలం'లో ఆయన అందించిన సంగీతం ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. అదే స్థాయిలో ఈ చిత్రానికి కూడా సంగీతం ప్రధాన బలం అవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

ఇదిలా ఉండగా, రామ్ చరణ్ నటించిన తాజా చిత్రం పెద్ది త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ క్రీడా నేపథ్య యాక్షన్ డ్రామా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చరణ్ 'పెద్ది పెహిల్వాన్' పాత్రలో కనిపించనుండగా, కథానాయికగా జాన్వీ కపూర్ నటిస్తోంది. అలాగే శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

వరుస భారీ ప్రాజెక్టులతో రామ్ చరణ్ కెరీర్ మరింత బిజీగా మారుతున్న నేపథ్యంలో, సుకుమార్‌తో ఈ కొత్త సినిమా ఆయన అభిమానులకు మరో ప్రత్యేక అనుభూతిని అందించనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి, ఈ కాంబో మళ్లీ ఏ రేంజ్‌లో మ్యాజిక్ సృష్టిస్తుందో చూడాలి.

# 'స్పిరిట్' రిలీజ్‌పై కొత్త టాక్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్పిరిట్ చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా విడుదల తేదీపై ఆసక్తికరమైన వార్తలు వెలువడుతున్నాయి.

మొదట ఈ చిత్రాన్ని 2027 మార్చిలో విడుదల చేయాలని యోచించినట్లు సమాచారం. అయితే ఇప్పుడు దర్శకుడు తన ప్రణాళికను మార్చినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గతంలో ఆయన తెరకెక్కించిన యానిమల్ చిత్రం డిసెంబర్ 1న విడుదలై ఘనవిజయం సాధించడంతో, అదే తేదీని 'సెంటిమెంట్'గా తీసుకుని 'స్పిరిట్'ను కూడా 2027 డిసెంబర్ 1న విడుదల చేయాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడాల్సి ఉంది.

ఈ చిత్రంలో ప్రభాస్ తొలిసారి పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. సందీప్ రెడ్డి వంగ సినిమాల్లో హీరో పాత్రలు సాధారణంగా గాఢమైన భావోద్వేగాలతో, తీవ్రమైన మానసిక స్థితులతో ఉండటం తెలిసిందే. దీంతో ప్రభాస్‌ను ఆయన ఎలా చూపిస్తారో అన్న ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది.




ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణానికి ముందు దశ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కథ, పాత్రల రూపకల్పన, సాంకేతిక అంశాలపై దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రభాస్ కూడా తన ఇతర భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, 'స్పిరిట్'పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

మొత్తానికి, విడుదల తేదీపై స్పష్టత రాకపోయినా 'స్పిరిట్' సినిమాపై ఉన్న అంచనాలు మాత్రం తగ్గేలా కనిపించడం లేదు. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# ఓటీటీలోకి 'పాపం ప్రతాప్' విడుదల తేదీ ఖరారు

తెలుగు ప్రేక్షకుల్లో విభిన్నమైన కథలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటుడు తిరువీర్ నటించిన భావోద్వేగ గ్రామీణ చిత్రం పాపం ప్రతాప్ ఇప్పుడు డిజిటల్ వేదికపై ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం ఓటీటీ విడుదల తేదీపై స్పష్టత రావడంతో సినీప్రియుల్లో ఆసక్తి పెరిగింది.

దర్శకుడు ఎస్.సి. దుర్గా నగేష్ రూపొందించిన ఈ సినిమా పల్లెటూరి సహజ వాతావరణంలో సాగుతూ, మనుషుల భావోద్వేగాలను హృదయానికి హత్తుకునే విధంగా చూపిస్తుంది. ఇందులో తిరువీర్ నటన మరోసారి ప్రత్యేకంగా నిలిచింది. ఆయనకు జంటగా పాయల్ రాధాకృష్ణ నటించి, ఇద్దరి మధ్య సన్నివేశాలు కథకు బలాన్నిచ్చాయి. ముఖ్యంగా గ్రామీణ జీవనశైలి, మనుషుల మధ్య బంధాలను సహజంగా చూపించడం సినిమాకు ప్రధాన ఆకర్షణగా మారింది.

సంగీత దర్శకుడు కె.ఎమ్. రాధాకృష్ణన్ అందించిన సంగీతం చిత్రంలోని భావోద్వేగాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లింది. ప్రతి సన్నివేశంలోనూ నేపథ్య సంగీతం కథతో మేళవించి ప్రేక్షకుడిని అనుభూతిలోకి తీసుకెళ్లేలా ఉంది. నిర్మాణ విలువలు కూడా కథకు తగినట్టుగా సహజంగా ఉండటం గమనార్హం.

ఈ చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ వేదిక ఈటీవీ విన్ సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, 'పాపం ప్రతాప్' చిత్రం మే 7 నుంచి స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. గ్రామీణ కథలు, సహజ నటన, భావోద్వేగ ప్రధాన చిత్రాలను ఇష్టపడే వారికి ఇది మంచి ఎంపికగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తంగా, హృదయాన్ని హత్తుకునే కథతో రూపొందిన ఈ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను కూడా అలరిస్తుందా అన్నది చూడాలి.

# హాలీవుడ్ సంచలనం 'ది ఒడిస్సీ' ట్రైలర్ విడుదల

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో ఒకటైన 'ది ఒడిస్సీ' ట్రైలర్ విడుదలైంది. ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. భారీ నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్స్‌తో ఈ సినిమా మరోసారి నోలన్ ప్రతిభను ప్రపంచానికి చూపించనుందని ట్రైలర్ స్పష్టంగా తెలియజేస్తోంది. గ్రీకు పురాణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో ట్రోజన్ యుద్ధం అనంతరం తన స్వదేశానికి తిరిగి చేరుకోవడానికి ఒక వీరుడు చేసే సాహసయాత్ర ప్రధాన కథాంశంగా నిలుస్తోంది. ఈ ప్రయాణంలో అతడు ఎదుర్కొనే ప్రమాదాలు, మానసిక సంఘర్షణలు, అద్భుత జీవులతో జరిగిన పోరాటాలు కథను మరింత ఆసక్తికరంగా మార్చనున్నాయి. ట్రైలర్‌లో చూపించిన సముద్ర యుద్ధాలు, విభిన్న ప్రపంచాల చిత్రణ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తన చిత్రాలలో ప్రత్యేకంగా ఉపయోగించే సాంకేతికతను ఈ చిత్రంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.




ముఖ్యంగా ఐమాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన యుద్ధ సన్నివేశాలు, విశాలమైన సముద్ర దృశ్యాలు వెండితెరపై అద్భుత అనుభూతిని అందించనున్నాయి. సుమారు రెండు వందల యాభై మిలియన్ డాలర్ల భారీ వ్యయంతో నిర్మితమవుతున్న ఈ చిత్రం నోలన్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన చిత్రంగా నిలవనుంది. ప్రపంచవ్యాప్తంగా జూలై 17న విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం, విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులను సృష్టించే అవకాశముందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే ట్రైలర్‌తోనే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించిన 'ది ఒడిస్సీ' సినిమా, విడుదల తర్వాత ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.



# 'టాక్సిక్' వివాదానికి కియారా చెక్

కన్నడ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా టాక్సిక్ చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ముఖ్యంగా ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాలపై వచ్చిన వార్తలు వైరల్ కావడంతో ఈ చిత్రం మరింత హాట్ టాపిక్‌గా మారింది. సినిమాలో తనపై చిత్రీకరించిన కొన్ని ఘాటైన సన్నివేశాలను తొలగించమని లేదా మార్పులు చేయాలని కియారా మేకర్స్‌ను కోరిందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. టీజర్‌లో కనిపించిన గ్లామర్ విజువల్స్ కారణంగా ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. దీంతో సినిమాలో బోల్డ్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందన్న అంచనాలు ప్రేక్షకుల్లో పెరిగాయి.అయితే ఈ మొత్తం ప్రచారంపై కియారా అద్వానీ స్వయంగా స్పందిస్తూ స్పష్టమైన క్లారిటీ ఇచ్చింది. తన సామాజిక మాధ్యమం వేదికగా స్పందించిన ఆమె, "నేను ఎలాంటి సన్నివేశాల విషయంలోనూ మార్పులు కోరలేదు. ప్రచారంలో ఉన్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవే" అని పేర్కొంది. దీంతో ఈ వివాదానికి పూర్తిగా తెరపడినట్లైంది. ఈ చిత్రం టీజర్ విడుదలైనప్పటి నుంచి కియారా పాత్ర చుట్టూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆమె లుక్, తెరపై కనిపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, కథపై ఆసక్తిని పెంచింది. అయితే అధికారిక సమాచారం లేకుండానే పుట్టుకొచ్చిన ఊహాగానాలు ఒక్కసారిగా వైరల్ కావడం ఈ ఘటన మరోసారి స్పష్టంచేసింది. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను దర్శకురాలు గీతూ మోహన్ దాస్ రూపొందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రం ప్రారంభం నుంచే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. యష్-కియారా కాంబినేషన్ కూడా సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయాలని భావించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. అభిమానులు ఈ అప్డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in